క్లుప్తంగా

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి 2009 మే 1, 2011 జులై 31లోపు జన్మించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న వారై ఉండాలన్నారు. 11వ తరగతిలో చేరాలనుకునేవారు విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2007 జూన్ 1, 2009 జులై 21 మధ్య జన్మించి వుండాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'జగనన్నకు చెబుదాం' విజయవంతం చేయాలి

నిమ్మనపల్లె : ఈనెల 22వ తేదీ నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అధికారులందరూ కలిసి విజయవంతం చేయాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గిరీషా,జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరయ్యేలా సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేష గిరిరావు, ఈఓపీఆర్డీ చలపతిరావు,సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఏఓ మురళీమోహన్, హార్టికల్చర్ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, వెటర్నరీ అధికారి సురేష్, ఏపిఓ రమేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా పోలప్ప



ములకలచెరువు : ములకలచెరువు ఎంపీడీఓగా కే. పోలప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా కొత్తపల్లి అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న ఆయన పదోన్నతిపై ములకలచెరువుకు వచ్చారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాభివృద్ధి కోసం కృషిచేస్తానని తెలిపారు.

యోగా పోటీల్లో ప్రతిభ

కురబలకోట : మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ చివరి సంవత్సరం ఈఈఈ విద్యార్థి అరవింద్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. కర్నూల్‌లో జరిగిన 48వ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్–23 పోటీల్లో ప్రతిభ చాటినట్లు బుధవారం తెలిపారు. కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, రాటకొండ రంగా రెడ్డి అకాడమీ అధ్యక్షుడు నాదేళ్ల ద్వారకనాథ్ అభినందించారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన వైద్య సిబ్బంది కొరత

కలికిరి : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సుల కొరత ఉన్నట్లు ఆసుపత్రి వైద్యాధికారులు, నర్సులు బుధవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిరోజు ఔట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల సంఖ్య అధికంగా ఉంటోందని, సిబ్బంది కొరతతో వైద్య సేవలకు ఇబ్బంది కరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. స్పందించిన ఆయన మహల్ సీహెచ్‌సీ సూపరింటెండ్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇద్దరు నర్సులకు కలికిరి సీహెచ్‌సీకి తాత్కాలికంగా డ్యూటీలు కేటాయించాలని ఆదేశించారు.

నేటి నుంచి జీర్ణోద్ధరణ కార్యక్రమం

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం నుంచి జీర్ణోద్ధరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ మాజీ చైర్మన్ బింగి పాండు తెలిపారు. 21న సాయంత్రం విశ్వక్సేణ పూజలతో పూజలు నిర్వహిస్తామన్నారు. 22న బాలాలయ ప్రతిష్టాపణ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

తంబళ్లపల్లె : మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం గోపిదిన్నె పంచాయతీలో చేపట్టిన కార్యక్రమాన్ని సందర్శించారు. ఏఎన్ఎంలతో ఆరా తీశారు. ప్రతి కుటుంబంలోని సభ్యుల అందరి ఆరోగ్య స్థితిగతులు విచారించి సర్వే పూర్తి చేయాలన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో మృతిచెందిన షర్మిలా కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు అందజేశారు. గ్రామానికి చెందిన ఎస్.జాఫర్‌వలీ వారం రోజుల కిందట రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. వారంరోజులుగా మనస్తాపానికి గురైన జాఫర్‌వలీ భార్య షర్మిలా మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ. లక్ష మంజూరు చేయించారు. బుధవారం షర్మిలా ఆమె అంత్యక్రియల కోసం మరో రూ.10 వేలు అదనంగా అందజేశారు.

పీలేరు పట్టణంలో గణేష్ విగ్రహాల ఊరేగింపు



పీలేరు : ఊరేగింపులో భక్తజన సందోహం



రామసముద్రం : తిరుమలరెడ్డిపల్లిలో..



పీలేరు : విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



ఘనంగా గణనాథుడి ఊరేగింపు

- అంబరాన్నంటిన గణేష్ నిమజ్జన సంబరాలు
- పీలేరు పట్టణంలో భారీ ఊరేగింపు
- సాంస్కృతిక కార్యక్రమాలతో పులకించిన పీలేరు
- సంబరాల్లో మునిగి తేలిన యువత
- ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఊరేగింపు ప్రారంభించిన ఎమ్మెల్యే



పీలేరు : ఊరేగింపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు పంచాయతీ కార్యాలయం మిట్టన విగ్రహాలకు హారతి ఇస్తున్న దృశ్యం

పీలేరు : పీలేరు పట్టణంలో గణేష్ నిమజ్జన సంబరాలు అంబరాన్నంటాయి. చవితి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను బుధవారం రాత్రి అంగరంగవైభంగా నిమజ్జనం చేశారు. పీలేరు పట్టణంలోని అన్ని వినాయక సెంటర్లలో విగ్రహాలను ట్రాక్టర్లపై పెట్టి చాంది ని, విద్యుద్దీపాలు, పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచే పట్టణంలో ఊరేగింపు కార్యక్రమం మొదలైంది. స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. విగ్రహాలన్నీ స్థానిక శివాలయం, అక్కడి నుంచి మదనపల్లె మార్గంలోని తిమ్మారెడ్డి క్రాస్ వద్దకు చేరుకుని పోలీస్ సీరియల్ నెంబర్లు తీసుకుని అక్కడి నుంచి ఊరేగింపుగా అయ్యప్పనాయునిచెరువు వద్దకు చేరుకున్నాయి. ఎల్‌బీఎస్ రోడ్డు, అజంతామిట్ట, పంచాయతీ కార్యాలయం, బస్టాండ్, నాలుగు రోడ్ల కూడలి, యల్లమంద క్రాస్ గుండా అయ్యప్పనాయుని చెరువు వరకు విగ్రహాల భారీ ఊరేగింపు సాగింది. ఊరేగింపు సందర్భంగా ప్రతి బండి వద్ద డీజే సాంగ్స్, బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటం, పిల్లనగ్రోవి, మంగళవాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కర్ణాటక నృత్యాలు, కేరళవాయిద్య బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలు విగ్రహాల ముందు డీజే సాంగ్స్, సౌండ్ సిస్టమ్స్‌తో యువత చిందులతో పీలేరు పట్టణం పులకరించిపోయింది. బళ్లారి డ్రమ్స్ మధ్య యువకులు కేరింతలు కొడుతూ, చిందులు వేస్తూ సంబరాల్లో మునిగితేలారు. పరస్పరం రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఊరేగింపు సందర్భంగా వేలాదిమంది భక్తులు, ప్రజలతో ఎల్‌బీఎస్ రోడ్డు కిక్కిరిసి పోయింది. ఊరేగింపుగా వచ్చిన విగ్రహాలకు భక్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేపట్టారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఊరేగింపుగా వచ్చిన విగ్రహాలకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఊరేగింపు అనంతరం సుమారు వంద విగ్రహాలు స్థానిక అయ్యప్పనాయుని చెరువులో నిమజ్జనం చేశారు. గణేష్ ఉత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పీలేరు పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బై..బై.. గణేషా

మదనపల్లె సిటీ : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె పట్టణంలో బుధవారం పలు ప్రాంతాల్లో వినాయకుని విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. స్థానిక అమ్మచెరువుమిట్ట, రామారావుకాలనీ,క్రిష్ణానగర్, ప్రశాంత్‌నగర్ ఎక్స్‌టెన్షన్, వాల్మీకివీధి, సొసైటీకాలనీ ప్రాంతాల్లోని వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. స్థానిక క్రిష్ణానగర్‌లో యువత ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం మండలంలో బుధవారం ప్రశాంతంగా వినాయకుడి నిమజ్జనం చేశారు. తిరుమలరెడ్డిపల్లె, కెసి.పల్లి, నరసాపురం, గుంతలపేట, దిన్నిపల్లె , చొక్కాండ్లపల్లి , గుంతయంబాడి , మినికి గ్రామాల్లో వైభవంగా వినాయకుడి ఊరేగింపు చేపట్టారు. జై బోలో గణపతి మహారాజ్‌కు జై, గణపతి బొప్పా...మోరియా అంటు యువకులు ఊరేగింపు చేశారు. గ్రామంలో బళ్లారి డ్రమ్స్ వాయిద్యాలు నడుమ కేరింతలు, కోలహలంతో సందడి నెలకొంది. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ , పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : మండలంలో ఊరురా వినాయక చవితిని ఉత్సాహంగా జరుపుకున్నారు. గణేష్‌యూత్ ఏర్పాటు చేసిన వినాయ విగ్రహాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాములు, జోగేంద్ర కుటుంబీకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కవితమ్మ భోజనం వడ్డించారు. ఎగువబోయపల్లె, చేలూరివాండ్లపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున రంగులు చల్లుకుంటూ చిన్నేరు ప్రాజెక్టు వద్దకు తీసుకెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వైభవంగా నిమజ్జనం

కలికిరి : వినాయక చవితిని పురస్కరించుకుని మండల పరిధిలో వాడవాడలా ఏర్పాటు చేసిన వినాయకున్ని బుధవారం అంగరంగ వైభవంగా గ్రామోత్సవాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. పట్టణ పరిధిలోని టీ.బీ.రోడ్డు, క్రాస్‌రోడ్డు, ఏఎస్ఆర్ కాలని, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు, అలాగే మండల వ్యాప్తంగా పలు గ్రామాలలోనూ భక్తులు నిమజ్జన కార్యక్రమం చేపట్టారు.

కలకడలో..

కలకడ : మండలంలోని కోన, కె.బాటవారిపల్లె, తదితర గ్రామాలలో వినాయక నిమజ్జనం కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి భక్తుల పూజల అనంతరం ఉట్లోత్సవం, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో కొలువు దీర్చిన స్వామివారి విగ్రహాని ఊరేగింపు నిర్వహించారు. ఉదయాన్నే విగ్రహాల ఎదుట హోమాలు, యజ్ఞాలు చేశారు. అనంతరం వాహనాల్లో విగ్రహాలను కొలుదీర్చి మేళతాళాలతో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చుతూ ఊరేగింపు కొనసాగించారు. తమిళనాడు,కే రళ రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారుల విన్యాసాలు, గిరిజనలు జానపదాలు, మల్లయ్యకొండ భల్లూక వేషధారణలు ఆకట్టుకొన్నాయి. మహాశివుడు, కాళికామాత వేషధారణలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈసందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ గట్టిబందోబస్తు చర్యలు చేపట్టారు. అనంతరం సమీప చెరవుల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ములకలచెరువులో..

ములకలచెరువు : మండలంలోని గ్రామాల్లో నెలకొలి్న వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. ఉదయం మహిళలు, పిల్లలు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి వినాయకుడి విగ్రహాలను నిమజ్జన నిమిత్తం వాహనాల్లో ఊరేగించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను బుధవారం చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పిల్లలు, యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం : వినాయక చవితి సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణేష్ ప్రతిమలను ట్రాక్టర్లలో కొలువుంచి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ప్రజలు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గణనాథుడి లడ్డూ రూ. 1లక్ష

పెద్దమండ్యం : మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాట నిర్వహించారు. వినాయకుని విగ్రహం నిమజ్జనం సందర్భంగా బుధవారం వెలిగల్లు పంచాయతీలోని కాయలపల్లెలో లడ్డూకు నిర్వహించిన వేలం పాటలో గ్రామస్తులు పోటీ పడ్డారు. వెలిగల్లు ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ కుమార్‌నాయుడు రూ. 1. లక్షకు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నాడు. అలాగే కలిచెర్ల, తాటిమాకులపల్లె వినాయకుని విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. కలిచెర్ల బస్టాండు కూడలి వద్ద మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి ఎంపీపీ పూర్ణచంద్రిక, సర్పంచ్ విశ్వనాథల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రామాంజనేయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మదనపల్లె సిటీ : నిమజ్జనానికి తరలిపోతున్న వినాయక విగ్రహం



మదనపల్లె సిటీ : క్రిష్ణానగర్‌లో ఉట్లు కొడుతున్న యువత



తంబళ్లపల్లె : నిమజ్జనానికి తీసుకెళుతున్న విగ్రహాలు



పెద్దతిప్పసముద్రంలో..



కలికిరిలో నిమజ్జనానికి గణనాథుడు



పెద్దమండ్యం : రూ. 1. లక్షకు లడ్డూ దక్కించుకున్న కుమార్‌నాయుడు



గుర్రంకొండ : వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం



తంబళ్లపల్లె : అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ



ములకలచెరువు : నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడి విగ్రహాలు



గుర్రంకొండ: కాళికామాత, పరమశివుడి వేషధారణలు

ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాలు

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : నియోజకవర్గంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు, పోలింగ్‌శాతం పెరిగేందుకు వీలుగా ఓటర్లకు అనువైన ప్రాంతాల్లో పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అన్ని రాజకీయపార్టీలు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీలో పోలింగ్‌స్టేషన్స్ ఏర్పాటుపై దృష్టిసారించినట్లు తెలిపారు. మదనపల్లె పట్టణంలో ఒకే ప్రాంతంలో 11 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు 3కి.మీ.లకు పైగా రావాల్సి వస్తోందన్నారు. దీంతో పోలింగ్‌శాతం తగ్గిపోతోందని అన్ని రాజకీయపార్టీల అభ్యర్థన మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాదాపు 31 పోలింగ్‌స్టేషన్‌లలో ప్రజలు నివసించే ప్రాంతంలో కాకుండా వేరేచోటకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి వస్తున్నట్లు ఇంటింటి సర్వేలో గుర్తించామన్నారు. నీరుగట్టువారిపల్లె, రామారావుకాలనీలో పోలింగ్‌కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు కొత్త పోలింగ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వ లేదా ప్రైవేట్ భవనాలను ఎంపిక చేసి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అన్ని వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 1350 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను రెండుగా చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందిస్తామని, మొత్తం 9 కేంద్రాలు ఉన్నాయన్నారు. మండలంలోని బొమ్మనచెరువులో ఒకే భవనంలో రెండుపోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఎన్నికల నిర్వహణ కష్టంగా ఉంటోందన్న అభ్యర్థన మేరకు, అదే గ్రామంలో నూతనంగా నిర్మించిన మరో ప్రభుత్వభవనంలోకి పోలింగ్‌కేంద్రం మార్చాలన్న అభ్యర్థనపై పరిశీలించి ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. ఒక కుటుంబం.. అందులోని ఓటర్లు అందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లు ఉండేలా ఎన్నికల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. బీఎల్వోలు తమ పరిధిలోని పోలింగ్‌కేంద్రం, ఓటర్లకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రంకు మార్పుకు సంబంధించి ఫారం–8లు మాత్రమే తీసుకోవాలన్నారు. డోర్ నెంబర్ లేకుండా ఓటరు నమోదుచేయవద్దని, ఒకే ఇంట్లో 10 ఓట్లుపైన ఉంటే వాటిని పునఃపరిశీలించాలన్నారు. నియోజకవర్గంలో 33 పోలింగ్‌స్టేషన్‌లుకు సంబంధించి మార్పులు,చేర్పులు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రతినిధి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ.. పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అధికారులు చేపడుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ శివారు ప్రాంతాలకు సంబంధించి నూతనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్‌లు మహబూబ్ చాంద్, దైవరాజన్, సీ.ఆర్.మంజుల, జనసేన జంగాలశివరాం, ఆప్ కృష్ణమూర్తి, సీపీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల మార్పుపై ఆర్డీఓ మురళికి వివరిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి

దాతల సహకారం అభినందనీయం

వాల్మీకిపురం : సేవా కార్యక్రమాలకు దాతల సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పీలేరుకు చెందిన వ్యాపారవేత్త నందలూరి భాస్కర్ స్థానిక సాయి నారాయణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేల నగదును ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరుపేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి కలుగుతుందన్నారు. నిరంతరం పేదలకు, రోగులకు అభాగ్యులకు అన్నదాన చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, లక్ష్మన్న, చంద్రశేఖర్ ఆచారి, క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

మదనపల్లె : భారతీయ అంబేద్కర్ సేన(బాస్), వియభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సంయుక్తంగా స్థానిక సొసైటీకాలనీలోని విజయభారతి హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి స్పందన లభించింది. నారాయణ హృదయాలయకు చెందిన వైద్యనిపుణులు, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్.మంజునాథబాబు, క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్.కిరణ్‌కుమార్‌తో పాటు టెక్నీషియన్స్ వైద్యశిబిరంలో పాల్గొన్నారు. వైద్యశిబిరానికి 336 మంది హాజరుకాగా, వారికి ఈసీజీ, ఎకో, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి గుండె వైద్యనిపుణులు స్క్రీనింగ్ చేశారు. 18 మందికి గుండెజబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిని శస్త్రచికిత్సల కోసం రెఫర్ చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి నారాయణ హృదయాలయ కోలార్ బ్రాంచ్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

పెద్దతిప్పసముద్రం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలిస్తున్నారని ప్రజా ప్రతినిధులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ అన్నారు. బుధవారం మండలంలోని అంకిరెడ్డిపల్లి పంచాయతీలో పల్లెబాట చేపట్టారు. గత నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను గడప గడపకూ వెళ్ళి ప్రజలకు వివరించారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను మంజూరు చేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందని ధీమా వ్యక్తం చేశారు. అర్హులై ఇంకా పథకాలు అందని లబ్ధిదారులు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ప్రజలకు భరోసా కల్పించారు. విద్యుత్ లైన్లు మార్పు చేయాలని, మురుగు కాలువలు, సిమెంటు రోడ్లు వేయించాలని పలువురు పల్లెబాట బృందం దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక సర్పంచ్ మూగలమర్రి భాగ్యమ్మ, బోర్‌వెల్ నారాయణరెడ్డి, కటికపల్లి శివారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రియాసత్ అలీఖాన్, తలారి నగేష్, నారాయణ స్వామి, వెంకట్రాయప్ప, వన్నూరు,మధు, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఏఓ ప్రేమలత పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి : కలికిరి సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వాల్మీకిపురం మండలం మూరేవాండ్లపల్లికి చెందిన కె.లక్ష్మణ రెడ్డి(60) మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం కలికిరి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మణ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని, ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళా పక్షపాతి మోదీ

పీలేరు రూరల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ మహిళా పక్షపాతి అని బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. బుధవారం పీలేరులో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర్య భారతదేశంలో పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టి ఒక అత్యున్నత ఘట్టానికి నాంది పలికారని తెలిపారు.